సాక్షి
మంచిర్యాల
శనివారం ၊ 2 ၊ మార్చి ၊ 2024



ఉద్యోగాలు సాధించారు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలువురు రెండు.. మూడు.. నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గృహిణి, వాచ్‌మెన్, ఉద్యోగాలు చేస్తూనే ప్రతిభను చాటుకున్నారు. 8లో▶



ధ్రువపత్రాల అందజేత

మందమర్రిరూరల్: మందమర్రిలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన 51మందికి ధ్రువపత్రాలు అందజేశారు. ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
36.0 /23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భూ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: ధరణిలో నమోదైన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కారానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధరణి సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణిలో నమోదైన దరఖాస్తు సమస్యల పరిష్కారానికి నేటి నుంచి ఈ నెల 9 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

'కమీషన్ల కోసమే కాళేశ్వరం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆరోపించారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును కాళేశ్వరం వద్ద ఏర్పాటుచేసిన ప్రజాధనం దోచుకున్నారని మండిపడ్డారు. గోదావరి తీర ప్రాంత రైతులు బ్యాక్‌వాటర్‌తో పంటలు నష్టపోతున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పగుళ్లు ఏర్పడి పనికి రాకుండా పోయిందని, కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నీలయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రాంచందర్ పాల్గొన్నారు.

బుగ్గ జాతర ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్ష



సమీక్ష చేస్తున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధి పెద్ద బుగ్గలో మహా శివరాత్రి జాతర ఏర్పాట్లపై ఆర్డీవో హరికృష్ణ సమీక్షించారు. శుక్రవారం ఆర్డీవో చాంబర్‌లో ప్రభుత్వ శాఖల అధికారులతో చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ నెల 8న జాతర ప్రారంభమై 10న ముగుస్తుందని పేర్కొన్నారు. జాతర నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, సీఐ అఫ్జలుద్దీన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, అటవీ, పోలీసు, దేవాదాయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నిర్వాహక కమిటీ శ్రేణులు పాల్గొన్నారు.

రోడ్డు, వంతెన నిర్మించాలని ధర్నా



రహదారిపై సీపీఎం నాయకుల ఆందోళన

భీమారం: మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారిలోని భీమారం జోడువాగు వద్ద రోడ్డు, వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా నాయకుడు బొడెంక చందు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంతకుముందు ధ్వంసమైన రోడ్డు, శిథిలావస్థకు చేరిన వంతెన పరిశీలించారు. జోడువాగుల వద్ద రోడ్డు, వంతెన ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సీపీఎం నాయకులు నాగజ్యోతి, ఉమారాణి, సరిత, నగేష్‌కుమార్, తింగన్న పాల్గొన్నారు.

భూ సమస్యలు కొలిక్కి!

- జిల్లాలో 'ధరణి' ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం
- రికార్డులు, క్షేత్రస్థాయిలో పరిశీలనలు
- మండలాల్లో అధికారులతో బృందాలు
- వివాదాల్లేనివి తొలుత పరిష్కారం



మందమర్రి తహసీల్‌లో అధికారులతో ప్రత్యేక డ్రైవ్‌పై సమీక్షిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుండడం అర్జీదారులకు ఊరటనిస్తోంది. గత కొంతకాలంగా 'ధరణి' పోర్టల్‌లో పలు సమస్యలపై దరఖాస్తు చేసుకున్నా పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. వీటిలో కొన్ని సులువుగానే పరిష్కారమయ్యేవి ఉన్నాయి. పట్టాదారు లింగం(జెండర్) మార్పులు, కులం నమోదులో తప్పులు, ఆధార్ నమోదు వంటివి త్వరితగతిన పరిష్కారం చేసుకునే అవకాశం ఉంది. మరికొన్ని కోర్టు విచారణలో ఉండడం, విస్తీర్ణం, హద్దులు, సర్వేనంబర్లు, నిషేధిత జాబితాలు, అసైన్డ్ భూములు, వారసత్వ గొడవలు, రెవెన్యూ, అటవీ వివాదాలుగా ఉన్నాయి.

గ్రామాలకు ప్రత్యేక బృందాలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా మండలాల పరిధిలో 'ధరణి' మాడ్యూల్స్‌లో ఉన్న ప్రకారం వేరు చేస్తున్నారు. గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఆర్ఐలతోపాటు డిప్యూటీ తహసీల్దార్లతో ఒక్కో మండలంలో రెండు నుంచి మూడు బృందాలు ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, డివిజన్‌లో ఆర్డీవోలు, జిల్లా స్థాయిలో కలెక్టర్, ఆపైన సీసీఎల్ఏ వరకు ప్రతీ దరఖాస్తును రికార్డు చేయనున్నారు. రికార్డుల్లో ఉన్న ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలనకు గ్రామస్థాయిలో అర్జీదారుల భూముల వరకు బృందాలు వెళ్లనున్నాయి. అక్కడ వాస్తవ పరిస్థితిని రికార్డు చేసుకుని, రికార్డుల్లో ఉన్న వాటిని సరిపోల్చుకుని నిర్ణయం తీసుకోనున్నారు. వివాదంలో ఉన్న వాటిపై ప్రస్తుతం నిర్ణయం వాయిదా వేసే అవకాశం ఉంది. ఎలాంటి చిక్కులు లేకుండా చిన్న సమస్యలతో పట్టాదారులు ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి వెంటనే పాస్‌బుక్‌లు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో 7,200అర్జీలు పెండింగ్

జిల్లాలో 18మండలాల పరిధిలో ధరణి పోర్టల్‌లో ఇప్పటివరకు 7,200 వరకు పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో వీలైనంత వరకు పరిష్కారం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు మాడ్యుల్స్‌లో ఇన్నాళ్లు పరిష్కారానికి వీలు కాకపోవడంతో కొంత కాలంగా అలాగే ఉన్నాయి. తాజాగా మండలం, డివిజనల్, జిల్లా స్థాయిలో ఈ ప్రత్యేక డ్రైవ్‌లో నిర్ణీత సమయం ఉండడంతో కొన్నింటికైనా సమస్య పరిష్కారం అవుతుందనే ఆశాభావంలో అర్జీదారులు ఉన్నారు.

అర్జీదారులకు సమాచారం

జిల్లా ధరణిలో పేరుకుపోయిన సమస్యలపై జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు సమావేశం అయ్యారు. ఆయా గ్రామాల్లో బృందాలుగా ఏర్పాటు చేశారు. ఏ గ్రామంలో ఎన్ని దరఖాస్తులు ఉన్నాయో తెలుసుకుని, అర్జీదారుల వారీగా మండల రెవెన్యూ అధికారుల నుంచి ఫోన్‌లో సమాచారం ఇస్తున్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో సిద్ధంగా ఉండాలని చెబుతున్నారు. అలాగే క్షేత్ర స్థాయి పర్యటనకు వచ్చినప్పుడు దరఖాస్తుదారులు తగిన వివరాలతో ఉండాలని కోరుతున్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో తొలిరోజు రికార్డుల పరిశీలన, అధికారులతో సమావేశాలు, బృందాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 9 వరకు ఈ డ్రైవ్ కొనసాగనున్న నేపథ్యంలో వీలైనన్ని సమస్యలు పరిష్కరించేలా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ మోతిలాల్ ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

'లఖ్‌పతి దీదీ'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీవో కిషన్

బెల్లంపల్లిరూరల్: లఖ్‌పతి దీదీపై వీవోఏలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండి మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా చొరవ తీసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బెల్లంపల్లి, మందమర్రి మండలాల ఐకేపీ వీవోఏలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లఖ్‌పతి దీదీ పథకంపై రెండు రోజుల శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిషన్ మాట్లాడుతూ మహిళలు ఐకేపీ ద్వారా రుణాలు తీసుకుని సక్రమంగా వినియోగించుకునేలా చూడాలని అన్నారు. వ్యవసాయం, స్వయం ఉపాధి, ఇతర మహిళలకు ఉపాధి కల్పించడం, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా లక్షాధికారులు కావాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు స్వర్ణలత, రమేష్, ఏపీఎంలు జీవన్, సంతోష్, శ్యామల, ఏటీఎం లలితకుమారి, సీసీలు, వీవోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి అద్దె బాధలు



అద్దె బకాయిలు, బిల్లులు చెల్లించాలని చిన్నయ్యకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

- ఏడాదికి పైగా పెండింగ్
- ఆరోగ్యలక్ష్మి, ఇతర ఖర్చుల బకాయిలు

మంచిర్యాలటౌన్: అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదికి పైగా అద్దె చెల్లించాల్సి ఉంది. దీంతో ఆయా కేంద్రాలు నిర్వహిస్తు న్న అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 'అద్దె డబ్బులు వస్తాయి, చెల్లిస్తాం..' అంటూ ఇళ్ల యజమానులకు ప్రతీ నెల ఏదో ఒక సాకు చెప్పి దాటవేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఏ డాదిగా అద్దె చెల్లించకపోవడంతో యజమానుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికలకు ముందే అద్దె డబ్బుల చెల్లింపునకు అధికారులు సిద్ధం చేసినా ఎన్నికల పేరిట వాయిదా వేసినట్లు తెలిసింది. ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడినా పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలు చెల్లించలేదు. మూడు నెలలుగా అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెండింగ్‌లో ఉండగా, ఇటీవ లే రెండు నెలల వేతనాలు వేశారు. అద్దె డబ్బులు సైతం వేయాలని అద్దె భవనాల టీచర్లు ఆందోళన బాట పడుతున్నారు. అద్దె చెల్లించాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన చేపట్టారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	అద్దె భవనాలు	స్వంత భవనాలు/ అద్దె లేనివి
బెల్లంపల్లి	279	113	166
చెన్నూరు	245	135	110
లక్సెట్టిపేట	203	59	144
మంచిర్యాల	242	183	59
మొత్తం	969	490	479

ప్రభుత్వానికి పంపించాం

అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బకాయిల వివరాలు ప్రభుత్వానికి పంపించాం. బిల్లులు విడుదల కాగానే చెల్లిస్తాం. టీచర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులూ విడుదల చేసి అందించేందుకు చర్యలు తీసుకుంటాం. అద్దె బిల్లుల చెల్లింపుల్లో సాంకేతిక సమస్య వల్ల కొంత ఆలస్యం జరిగింది.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

బిల్లులన్నీ పెండింగ్‌లోనే..

జిల్లాలో మొత్తం 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో 490 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 164 కేంద్రాలకు మాత్రమే స్వంత భవనాలు ఉండగా, 315 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాలు, ఉచితంగా లభించిన భవనాల్లో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా సగానికి పైగా కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతుండడం గమనార్హం. ఏడాదికి పైగా అద్దె చెల్లించకపోవడంతో యజమానుల నుంచి టీచర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అద్దె బకాయిలతోపాటు కూరగాయలు, గ్యాస్ బిల్లులు, టీఏ, డీఏలు, పోషణ్ అభియాన్ డబ్బులు ఏడాదికి పైగా చెల్లించకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు వారి స్వంత డబ్బులు ఖర్చు చేసి కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వేతనాలు సైతం ఆలస్యంగా వస్తుండడం, కేంద్రాల అదనపు ఖర్చులను టీచర్లే భరిస్తుండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల తోపాటు అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేస్తున్నారు.

డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ బదిలీ

- మంచిర్యాల డీసీపీగా అశోక్‌కుమార్



సుధీర్ రాంనాథ్ కేకన్



అశోక్‌కుమార్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మహబూబాబాద్ ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జయశంకర్‌భూపాలపల్లి జిల్లా ఎస్పీగా పని చేస్తున్న 2019 బ్యాచ్‌కు చెందిన అశోక్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 జనవరి 26న డీసీపీగా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌రాంనాథ్ కేకన్ 13నెలలపాటు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై సానుకూలంగా స్పందించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు.

ప్రొబేషనరీ పిరియడ్‌లో అశోక్‌కుమార్ విధులు

అశోక్‌కుమార్ ఐపీఎస్ ప్రొబేషనరీ పిరియడ్‌లో జిల్లాలోని నస్పూర్ పోలీసుస్టేషన్‌లో 2020అక్టోబర్ 26నుంచి 2021 జనవరి 20వరకు విధులు నిర్వర్తించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారు. ఎవరు ఎలాంటి ఫిర్యాదు చేసినా క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. గంజాయి, బెల్ట్‌షాపులు, సిట్టింగ్‌పాయింట్లపై ఫిర్యాదులు రాగా నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఈ విషయంలో కొందరు ప్రముఖ రాజకీయ నాయకులు కలిసేందుకు వెళ్లగా వారిని సైతం లెక్క చేయలేదనే ఆరోపణలున్నాయి. మూడు నెలల కాలంలో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. ప్రస్తుతం ఆయన డీసీపీగా వస్తుండడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

డాటా ఎంట్రీ డబ్బులేవి!

- ఆపరేటర్ల ఎదురుచూపులు
- జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తులు 2,56,230
- 2,050 మందికి రూ.30లక్షలపైనే బకాయి



నెన్నెల ఎంపీడీఓ కార్యాలయంలో ఆపరేటర్లు

నెన్నెల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం కింద ఆరు గ్యారంటీల అమలుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా ప్రజల నుంచి అనూహ్య స్పందన రాగా దరఖాస్తుల సంఖ్య 2,56,230కు చేరింది. వీటిని కంప్యూటర్లలో ఎంట్రీ చేయడానికి జిల్లాలోని ఏడు మున్సిపాల్టీలు, 16మండలాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు ప్రైవేటు ఆపరేటర్లు సుమారు 2,050మంది రాత్రి, పగలు పని చేశారు. ఒక్కో దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదుకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.5, ప్రైవేటు ఆపరేటర్లకు రూ.15చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన సుమారు రూ.30లక్షలపైనే ప్రభుత్వం బకాయి పడింది. 40రోజులు దాటినా ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లాలో దరఖాస్తుల ఎంట్రీకి 1,702 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుల కంప్యూటరీకరణ కోసం డాటా ఎంట్రీ ఆపరేటర్ల కోసం శిక్షణ ఇచ్చారు. జనవరి 8 నుంచి 18వరకు దరఖాస్తులను ఆపరేటర్లు ఆన్‌లైన్ చేశారు. వారం రోజుల్లో ఆన్‌లైన్ పూర్తి కావాలని అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టించారు. రాత్రి, పగలు పని చేసినా ఇప్పటివరకు డబ్బులు రాకపోవడంతో ఆపరేటర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఆపరేటర్ల వేతనాల విషయమై డీపీవో వెంకటేశ్వర్‌రావు సంప్రదించగా.. ప్రభుత్వానికి నివేదిక పంపించామని, నిధులు విడుదలైన వెంటనే అందజేస్తామని తెలిపారు.

ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారు



డాటా ఎంట్రీ డబ్బుల కోసం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్తే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లండి అని అక్కడికి వెళ్తే కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్లండని అధికారులు ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఈ వారం డబ్బులు వస్తాయని మరో వారం వస్తాయని అంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. అధికారులు మా బాధను పట్టించుకుని డబ్బులు అందేలా చూడాలి.

– కంపెల రాజశేఖర్,
డాటా ఎంట్రీ ఆపరేటర్ (నెన్నెల)

40 రోజులు గడిచాయి..



డాటా ఎంట్రీ చేసి 40 రోజులు గడిచినా డబ్బులు రాలేదు. ఎంట్రీ చేసిన వెంటనే జనవరి 12న డబ్బులు ఇస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. రోజుకు రూ.500 సంపాదించుకునే మేము రాత్రి, పగలు కష్టపడి పది రోజులు పని చేశాం. అధికారులు ఇప్పుడు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా డాటా ఎంట్రీ చార్జీలు అందజేసేలా చూడాలి.

– మురళీకృష్ణ,
డాటా ఎంట్రీ ఆపరేటర్, ర్యాలీగడ్‌పూర్

'రెట్టింపు' బాధితులు

- ఉపాధ్యాయులే అధికం
- ఆందోళనకు సన్నద్ధం

జన్నారం: దురాశకు వెళ్లి రూ.కోట్లు నష్టపోయిన ఓ కంపెనీ పెట్టుబడి బాగోతం తవ్వినకొద్దీ బయట పడుతోంది. ముందు రూ.8కోట్ల నుంచి రూ.10 కోట్లుగా భావించగా.. ఒకరి ద్వారా మరొకరు బయటపడడం వల్ల సుమారు రూ.15కోట్ల వరకు మండలానికి చెందిన వారు పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో అత్యధికంగా ఉపాధ్యాయులే కాగా కొందరు సామాన్యులు, రైతులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీ యజమాని తన కంపెనీలో పెట్టుబడి పెడితే ష్యూరిటీగా రెండు గంటల భూమి పట్టా చేయించి, రోజువారీ నగదును వ్యాలెట్ ఖాతాలో బదిలీ చేస్తారని, నెలకోసారి వ్యాలెట్ నుంచి తమ వ్యక్తిగత ఖాతాలోకి డబ్బులు జమ చేసుకోవచ్చని, 150 రోజుల్లో పెట్టుబడి రెట్టింపు అవుతుందని నమ్మబలికారు. ఈ విషయం తెలిసి అనేక మంది పెట్టుబడులు పెట్టారు. తీరా ఆ యజమాని అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణతో అరెస్టయి చర్లపల్లి జైలులో ఉండడంతో బాగోతం బయటకు వచ్చింది.

ఉపాధ్యాయుడితో మరికొందరు

మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు తనకు తెలిసిన బంధువు ద్వారా ఆ కంపెనీలో రూ.15లక్షలు పెట్టుబడి పెట్టగా.. ఆయనకు రెట్టింపు ఆదాయం వచ్చింది. తిరిగి రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టగా రోజువారీగా తన వ్యాలెట్ ఖాతాలో రూ.లక్ష వరకు జమ అయింది. ఈ విషయం తనతోటి ఉపాధ్యాయులకు చెప్పడంతో సుమారు పది నుంచి 20మంది వరకు ఉపాధ్యాయులు పెట్టుబడి పెట్టారు. ఒక్కొక్కరు రూ.5 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిసింది. వారికి తెలిసిన వ్యాపారులు, రైతులు కూడా రూ.లక్ష నుంచి రూ.15లక్షలకు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. ఇలా మండలంలో 60మందికి పైగా రూ.15కోట్ల వరకు పెట్టినట్లు తెలిసింది.

చేర్పిస్తే కమీషన్

కంపెనీలో మరొకరిని చేర్పిస్తే నగదును బట్టి 5నుంచి 10శాతం వరకు కమీషన్‌ను వెంటనే అందజేశారు. రూ.లక్ష పెట్టుబడి పెడితే చేర్పించిన వారికి రూ.5వేలు కమీషన్, రూ.15లక్షలకు రూ.లక్ష కమీషన్ వారి వ్యాలెట్‌లో జమ చేశారు. వ్యాలెట్ నుంచి నెల రోజుల తర్వాత తమ బ్యాంకు ఖాతాలోకి మార్చుకునే వీలుంది. మొదట చేరిన ఉపాధ్యాయుడు సుమారుగా రూ.3 కోట్లకు పైగా ఇతరులతో కంపెనీలో పెట్టుబడులు పెట్టించినట్లు ఆరోపణలున్నాయి. అతను కూడా రూ.70 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు చెబుతున్నారు. చిత్రమేమిటంటే వారికి పడే కమీషన్, రోజువారీగా వ్యాలెట్‌లో డబ్బులు పడడం చూసి ఓ బ్యాంకు మేనేజర్ కూడా ఇందులో పెట్టుబడి పెట్టినట్లు తెలిసింది.

ఆందోళనకు సిద్ధం

ఓ ఉపాధ్యాయుని ద్వారా ప్రైవేట్ కంపెనీలో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన బాధితులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. వారం రోజుల క్రితం సదరు ఉపాధ్యాయుని వద్దకు వెళ్లి డబ్బుల విషయంలో నిలదీయగా, తనకె లాంటి సంబంధం లేదని, మీరిచ్చిన డబ్బులు కంపెనీకి పంపినట్లు తెలిపారని పలువురు బాధితులు తెలిపారు. 'మాకు కంపెనీతో సంబంధం లేదు. మీ చేతికి డబ్బులిచ్చాం. తిరిగి ఇవ్వాలి..'అని నిలదీయగా.. తాను మరొకరికి ఇచ్చానని, అతడి నుంచి వసూలు చేసి ఇస్తానని, మరో వారం రోజులు సమయం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయమై జన్నారం ఎస్సై సతీశ్‌ను సంప్రదించగా, పెట్టుబడుల విషయం తన దృష్టికి రాలేదని, ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐజీగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు శుక్రవారం ఐజీగా బాధ్యతలు స్వీకరించారు. గత నెల ఫిబ్రవరి 14న డీఐజీ హోదాలో పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. గత నెల 25న ఐజీగా పదోన్నతి కల్పిస్తూ పోలీసు కమిషనర్‌గా విధులు నిర్వర్తించాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టగా కమిషనరేట్ ప్రాంగణంలో సిబ్బంది, సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



ఐజీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసిన పోలీస్ అధికారులు

నిషేధాజ్ఞలు పొడగింపు

మంచిర్యాలక్రైం: జిల్లాలో నిషేధాజ్ఞలను పొడగించినట్లు రామగుండం సీపీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, డీజే సౌండ్స్, డ్రోన్ కెమెరాల వినియోగం మార్చి ఒకటి నుంచి ఏప్రిల్ ఒకటి వరకు నిషేధించినట్లు తెలిపారు. ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు కనీస బడ్జెట్ కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటు తక్షణమే విడుదల చేయాలని తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, వంశీ, ప్రవీణ్, రాజేశ్, క్రాంతి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరికి జరిమానా

లక్సెట్టిపేట: పొలాన్ని ధ్వంసం చేసిన కేసులో ఇద్దరికి జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ తీర్పుచెప్పారు. ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2018లో లక్ష్మీపూర్‌కు చెందిన అప్పని లింగయ్య పొలాన్ని అదే గ్రామానికి చెందిన సురమల్ల చంద్రయ్య, సురమల్ల దుర్గయ్య ధ్వంసం చేసి, దుర్భాషలాడారు. లింగయ్య ఫిర్యాదుతో అప్పటి ఎస్సై మధుసూదన్ కేసు నమోదు చేశారు. కోర్టులో శుక్రవారం సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో దుర్గయ్యకు రూ.వెయ్యి, చంద్రయ్యకు రూ.200 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

రైలు కిందపడి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్ నగర్ విలేజ్ నెం.10 (దుర్గానగర్)కు చెందిన సంజయ్ మండల్ (25) శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సంజయ్ మండల్ కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందాడు. నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.10 (దుర్గానగర్) సమీపంలో న్యూఢిల్లీ నుంచి చెన్నై వైపు వెళ్లే గ్రాండ్‌ట్రంక్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


అశోక్(ఫైల్)

వేమనపల్లి: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని జక్కెపల్లి వాసి పోరెశెట్టి అశోక్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, నీల్వాయి ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాలు..అశోక్‌కు అదే గ్రామానికి చెందిన అనసూర్యతో గత 11 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. రెండేళ్ల నుంచి తాగుడుకు బానిసయ్యాడు. గతనెల 27న మద్యం తాగి ఇంటికి రాగా ఇలాగైతే కుటుంబాన్ని ఎలా పోషిస్తావని భార్య మందలించింది. మనస్తాపం చెందిన అశోక్ ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు అంబులెన్స్‌లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి కాంత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏరియాలో 68 శాతం బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): గత నెలలో బెల్లంపల్లి ఏరియాలో 68 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఇన్‌చార్జి జీఎం నరేందర్ తెలిపారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. గతనెలలో ఏరియాకు 4.4లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 2.97 లక్షల టన్నులతో 68 శాతం ఉత్పత్తిని సాధించిందన్నారు. ఖైరిగూడ ఓసీపీ నెల లక్ష్యం 2.90 లక్షల టన్నులు కాగా 2.97 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. గోలేటి ఓసీపీకి 1.5 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా ఇంకా ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఉత్పత్తి సాధించలేకపోయామన్నారు. ఏరియాలో ఇప్పటివరకు 37.8 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న సమయంలో 40 లక్షల టన్నుల బొగ్గు రవాణాను సులభంగా చేయగలమన్నారు. సమావేశంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించారు..

- ఒక్కొక్కరు 2.. 3.. 4 సర్కారు కొలువులు
- యువతకు ఆదర్శం..

ప్రభుత్వ ఉద్యోగం సాధించడమంటే మాటలు కాదు. లక్షల మంది నిరుద్యోగుల పోటీ... వందల సంఖ్యలో పోస్టులు.. లక్ష్య సాధనకు నిరంతరం సన్నద్ధమవుతూ పట్టుదలతో ఒక్కొక్కరు ఒక ఉద్యోగం కాదు రెండు.. మూడు.. నాలుగు సర్కారు కొలువులు సాధించారు. గృహిణి కుటుంబ బాధ్యతలు మోస్తూనే ఒకరు.. ఉద్యోగం చేస్తూనే మరొకరు.. తల్లిదండ్రులకు భారం కావొద్దని వాచ్‌మన్ వంటి పని చేస్తూనే ఇంకొకరు ఇలా పోటీ పరీక్షల్లో సత్తాచాటి ముందు నిలిచారు.

వాచ్‌మన్ టు లెక్చరర్

- తల్లిదండ్రులు ఇద్దరూ కార్మికులు
- భారం కాకుండా రాత్రి వాచ్‌మన్ ఉద్యోగం
- పది రోజుల వ్యవధిలో మూడు ఫలితాలు


అపాయింట్‌మెంట్ లెటర్‌తో ప్రవీణ్

జన్నారం: తల్లిదండ్రులు ఇద్దరూ కార్మికులు.. వారికి ఆర్థికంగా భారం కావొద్దని భావించి నైట్ వాచ్‌మన్ ఉద్యోగం చేస్తూ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడో యువకుడు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని మంచిర్యాల జిల్లా జన్నారం పొనకల్ గ్రామం గాంధీనగర్ కాలనీకి చెందిన గొల్లె ప్రవీణ్ నిరూపించాడు. కాలనీకి చెందిన గొల్లె పెద్దులు, పోశమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్. పెద్దులు మేస్త్రీ పని చేస్తుండగా, పోశమ్మ బీడి కార్మికురాలు. ప్రవీణ్ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పొనకల్ ప్రాథమిక పాఠశాలలో చదివాడు. 6నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో, ఇంటర్ కరిమల జూనియర్ కళాశాలలో, డిగ్రీ వికాస్ కళాశాలలో పూర్తి చేశాడు. 2019లో హైదరాబాద్ ఓయూ క్యాంపస్‌లో చేరి ఎంకామ్ చదివాడు. అనంతరం బీఈడీ, ఎంఈడీ కూడా పూర్తి చేశాడు. ఓ వైపు చదువుకుంటూనే తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా 2019 నుంచి ఉస్మానియా యూనివర్సిటీలోని ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రిసెర్చ్ సెంటర్(ఈఎంఆర్‌సీ)లో నైట్‌వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు.

పది రోజుల వ్యవధిలో

రాత్రిపూట వాచ్‌మన్‌గా చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. పనితోపాటు రాత్రంతా చదివేవాడు. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాల కోసం పరీక్ష రాశాడు. పది రోజుల వ్యవధిలో మూడింటి ఫలితాలు వెలువడగా మూడు ఉద్యోగాలూ సాధించాడు. ఫిబ్రవరి 11న విడుదల పీజీటీ సోషల్ స్టడీస్‌లో సెలెక్ట్ అయి, ఫిబ్రవరి 15న అపాయింట్‌మెంట్ లెటర్ తీసుకున్నాడు. గురువారం విడుదలైన జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల్లో కామర్స్‌లో ఎంపికయ్యాడు. గురువారం సాయంత్రం విడుదలైన టీజీటీ ఫలితాల్లో సోషల్ స్టడీస్ విభాగంలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వీటిలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం చేస్తానని తెలిపాడు.

అమ్మానాన్నలకు కష్టం లేకుండా చూస్తా

అమ్మానాన్నలు చిన్నప్పటి నుంచి కష్టపడి నన్ను చదివించారు. వారి కష్టాన్ని చూడలేక రాత్రి పూట వాచ్‌మన్‌గా పని చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. గతంలో మూడు ఉద్యోగాలకు పరీక్షలు రాశాను విడుదలైన ఫలితాల్లో నాకు మూడు ఉద్యోగాలు రావడం ఆనందంగా ఉంది. ఇందులో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూ మా అమ్మానాన్నలకు కష్టం లేకుండా చేస్తాను. – గొల్లె ప్రవీణ్

కొలువుల 'జ్యోతి'

- నాలుగు ఉద్యోగాలు సాధన
- టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులు

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన బోయినపల్లి జ్యోతి ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించింది. గురుకుల విద్యాలయాల్లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాల్లో సత్తా చాటింది. గ్రామానికి చెందిన బోయినపల్లి రాములు, లక్ష్మి దంపతుల కూతురు జ్యోతి. రాములు వృత్తిరీత్యా చిన్నపాటి పూజ సామగ్రి విక్రయ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడో సంతానం జ్యోతి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి వరకు చదివింది. బజార్‌హత్నూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. బజార్‌హత్నూర్ మండలంలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో తెలుగు లిటరేచర్‌లో డిగ్రీ చదివింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, తెలంగాణ యూనివర్సిటీలో బీఈడీ పూర్తి చేసింది. సెట్‌లో ఉత్తీర్ణత పొందింది. 2023లో కస్తూర్బా విద్యాలయాల్లో సీఆర్‌టీ పోస్టు కోసం పోటీ పడి తెలుగు సబ్జెక్టులో జిల్లాలోనే మొదటి ర్యాంకు సాధించింది. ప్రస్తుతం నేరడిగొండ మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో తెలుగు ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది.

పట్టుదలతో చదివాను



ఎలాగైనా ఉద్యోగం సాధించాలని లక్ష్యాన్ని ఏర్పర్చుకుని పట్టుదలతో చదివాను. ప్రతీరోజు తగిన సమయాన్ని చదువుకు కేటాయించాను. సిలబస్‌లో ఉన్న అంశాలపై అవగాహన తెచ్చుకుని చదవడం ప్రారంభించాను. తల్లిదండ్రులు ప్రోత్సాహం మరువలేను. వారి వల్లే ఉద్యోగాలు సాధించాను. డిగ్రీ అధ్యాపక వృత్తిని ఎంచుకుంటాను. – బోయినపల్లి జ్యోతి

ఐదేళ్లలో ఆరు ఉద్యోగాలు


బిట్లింగ్ ఉదయ్‌కుమార్

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన బిట్లింగ్ ఉదయ్‌కుమార్ 2019 నుంచి ఇటీవల ప్రకటించిన గ్రూప్–4 ఉద్యోగాల ఫలితాల వరకు ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. బిట్లింగ్ లక్ష్మణ్, లక్ష్మి దంపతుల కుమారుడు ఉదయ్‌కుమార్ 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగంలో చేరాడు. ఆ తర్వాత మూడేళ్లు 2019 నుంచి 2022 వరకు వీఆర్‌వోగా విధులు నిర్వర్తించాడు. 2022–23 పంచాయతీరాజ్‌లోనే జూనియర్ అసిస్టెంట్‌గా, 2023 డిసెంబర్ నుంచి నేటి వరకు సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో ఉన్నాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్–4 ఫలితాల్లో జిల్లాలో 11 స్థానంలో ఉన్నాడు. ఉదయ్‌కుమార్ బీటెక్ పూర్తి చేసి న్యూఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకుని వరుసగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నాడు.

అప్పుడు ఆర్మీ.. ఇప్పుడు కానిస్టేబుల్


నియామక పత్రం అందుకుంటున్న తల్లెల మహేందర్

జైనథ్: ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన ఈ కాలంలో ఓ ప్రభుత్వ ఉద్యోగం సాధించి రిటైర్మెంట్ తర్వాత మరోసారి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అంటే మామూలు విషయం కాదు. ఎంతో కృషి, పట్టుదల ఉంటే తప్ప సాధ్యం కాదు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం లేఖర్‌వాడ గ్రామానికి చెందిన తల్లెల మహేందర్ 2005లో ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం సాధించాడు. 17ఏళ్ల పాటు వివిధ హోదాల్లో భారతదేశంలోనే కాకుండా, యూఎన్‌ఓ సైన్యం తరపున లెబనాన్ దేశంలోనూ సేవలందించాడు. 2023లో రిటైర్మెంట్ తర్వాత ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా బీసీ స్టడీ సర్కిల్లో శిక్షణ తీసుకొని కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నాలు చేశాడు. ఇటీవల కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రం అందుకున్నాడు.

సేవ చేసే అదృష్టం...



ఆర్మీ జవాన్‌గా దేశ రక్షణ కోసం బార్డర్‌లో నిరంతరం సేవలందించడం సంతోషంగా ఉంది. దేశం వెలుపల సైతం పనిచేయడం జరిగింది. ఇప్పుడు కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో దేశ అంతర్గత వ్యవహారాల్లో లా అండ్ ఆర్డర్ పరిరక్షణ కోసం పనిచేసే అవకాశం కలుగడం అదృష్టంగా భావిస్తున్నాను. – తల్లెల మహేందర్

పిల్లలను చదివిస్తూ..

- మూడు ఉద్యోగాలకు ఎంపికైన సిరికొండ సోన
- భర్త ప్రోత్సాహంతో డిగ్రీ, పీజీ పూర్తి


కుటుంబ సభ్యులతో సిరికొండ సోన

భైంసా: ఒకేసారి మూడు ప్రభుత్వ కొలువులు సాధించి సిరికొండ సోన అందరి మన్ననలు పొందుతోంది. భైంసా మండలం వానల్‌పాడ్‌కు చెందిన గృహిణి పిల్లలను చదివిస్తూ.. తాను చదువుకుంటూ ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమై పోటీ పరీక్షలు రాసి కొలువులు దక్కించుకుంది. ఇటీవలే విడుదలైన ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలను సాధించింది.

చదువంతా నిర్మల్‌లోనే...

సిరికొండ సోన ఒకటి నుంచి పదో తరగతి వరకు నిర్మల్‌లోని సరస్వతీ శిశుమందిరంలో చదివింది. ఇంటర్ నిర్మల్‌లోనే పూర్తి చేసింది. 2010లో వానల్‌పాడ్ గ్రామానికి చెందిన సిరికొండ గాంధీతో వివాహమైంది. ఆ తర్వాత గాంధీ తన భార్య సోనను నిర్మల్‌లో డిగ్రీ, పీజీ చదివించాడు. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చినప్పుడల్లా ప్రోత్సహించాడు.

పిల్లలను చదివిస్తూ... తాను చదువుతూ...

సోన, గాంధీ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. రిశాంక్ ఆరవ తరగతి, రోహిత్ మోను మూడో తరగతి చదువుతున్నారు. వారిద్దరిని చదివిస్తూ తానూ పోటీ పరీక్షకు సిద్ధమైంది. ఇటీవల గురుకులాల్లో ఉద్యోగాల ఫలితాలు వెలువడగా టీజీటీ, పీజీటీల్లో ఎంపికైంది. జూనియర్ లెక్చరర్‌గాను ఎంపికైంది.

భర్త ప్రోత్సాహం..

మా వివాహం అయ్యాక నా భర్త డిగ్రీ, పీజీ చదివించేందుకు ప్రోత్సహించాడు. ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. జూనియర్ లెక్చరర్‌గా పనిచేయాలని అనుకుంటున్నాను. నా భర్తతోపాటు కుటుంబీకులకు ఎప్పటికీ రుణపడి ఉంటా. చదువు విషయంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రోత్సహించడంతోనే కొలువులు సాధించాను. – సిరికొండ సోన, వానల్‌పాడ్

ప్రత్యేకాధికారి.. మూడు ఉద్యోగాలు


మాడిశెట్టి వినీత

దండేపల్లి: దండేపల్లి మండల కేంద్రానికి చెందిన మాడిశెట్టి రాజన్న–లక్ష్మి దంపతుల కూతురు వినీత ప్రస్తుతం కన్నెపల్లి కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి పని చేస్తున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ టైలరింగ్ చేస్తూ పిల్లలను చదివించారు. వినీత ప్రభుత్వ కొలువు సాధించాలనే పట్టుదలతో చదివి, గురుకుల సొసైటీ అధ్యాపక ఉద్యోగ పరీక్షలు రాసింది. గురువారం విడుదలైన ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్ మూడు ఉద్యోగాలు సాధించింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు స్థానిక ప్రైవేటు పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ లక్సెట్టిపేట ప్రైవేటు కాలేజీలో చదివింది. కాగా, జేఎల్ ఉద్యోగంలో చేరుతానని ఆమె తెలిపింది.

ముచ్చటగా మూడు..


హరిప్రసాద్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లి

తాండూర్: తాండూర్ మండల కేంద్రానికి చెందిన తన్నీరు హరిప్రసాద్ ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించాడు. ఆర్టీసీ ఉద్యోగి తన్నీరు బుచ్చయ్య, లావణ్య దంపతుల కుమారుడు హరిప్రసాద్ ఎంఏ ఆర్కియాలజీలో పీజీ పూర్తి చేశాడు. మూడు నెలల క్రితం రైల్వే గ్రూప్ డీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగం కైవసం చేసుకున్నాడు. ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో ఆర్టీఏ కానిస్టేబుల్‌గా ఎంపిక అయ్యాడు. 20 రోజుల క్రితం విడుదలైన గ్రూప్–4 పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 467, జిల్లా స్థాయిలో 17వ ర్యాంక్ సాధించి ముచ్చటగా మూడో ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

ఐపీఎస్ సాధించడమే లక్ష్యం



మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సంతృప్తినిచ్చింది. కానీ సివిల్స్ ర్యాంక్ సాధించి ఐపీఎస్ కావడమే ముందున్న ఏకైక లక్ష్యం. మూడేళ్లుగా చదువుతోపాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ విజయం సాధించా. ప్రస్తుతం సివిల్స్ ప్రిపరేషన్‌లో ఉన్నా. సివిల్స్‌లో కూడా విజయం సాధిస్తానని నమ్మకం ఉంది. – హరిప్రసాద్

జూనియర్, డిగ్రీ లెక్చరర్

- గురుకుల ఫలితాల్లో బెల్లపు నగేశ్ సత్తా


నగేశ్

తాంసి: ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో తాంసి గ్రామానికి చెందిన బెల్లపు నగేశ్ ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో సత్తా చాటాడు. డిగ్రీ, జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా ఉద్యోగాలు సాధించాడు. మండల కేంద్రానికి చెందిన బెల్లపు దేవిదాస్, తానుబాయి దంపతులది వ్యవసాయ కూలీ కుటుంబం. కుమారుడిని ప్రయోజకుడిని చేయాలనే లక్ష్యంతో కూలీ పనులు చేస్తూ నగేష్‌ను చదివించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో, డిగ్రీ ఆదిలాబాద్‌లోని కళాశాలలో పూర్తి చేశాడు. 2015లో ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీలో పీజీ ప్రవేశ పరీక్షలో 2వ ర్యాంక్ సాధించాడు. పీజీ, 2019లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో బీఎడ్ పూర్తి చేశాడు. 2021లో మధ్యప్రదేశ్‌లోని రేవ సైనిక్ స్కూల్‌లో పరీక్ష రాసి అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల డిగ్రీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్, జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్‌తో ఉద్యోగాలు సాధించాడు. డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా చేరుతానని నగేశ్ తెలిపాడు.

నిత్యం నిర్మల్ లైబ్రరీకి వెళ్లి..


కార్యం సుప్రియ

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన కార్యం సుప్రియ ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో రెండు ఉద్యోగాలకు ఎంపికైంది. ఒకటి నుంచి డిగ్రీ వరకు నిజామాబాద్‌లో చదువుకుంది. తండ్రి ఉపాధ్యాయుడు కాగా భర్త రాజు ప్రోత్సాహంతో దూరవిద్యలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్ సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇంటి వద్ద ఉండి పూర్తి చేసింది. ఉపాధ్యాయ వృత్తిపై మమకారంతో పార్ట్ టైం ఉద్యోగినిగా పనిచేసింది. కుంటాల నుంచి ప్రతీరోజు నిర్మల్ లైబ్రరీకి వెళ్లి పరీక్షలకు సన్నద్ధమైంది. గురుకుల నియామక బోర్డు వెలువరించిన ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే జూనియర్ లెక్చరర్, పీజీటీ ఇంగ్లిష్ ఉద్యోగాలకు ఎంపికైంది. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు అని సుప్రియ పేర్కొన్నారు.

ఒకేసారి రెండు..


అవేజ్ ఉర్ రహెమాన్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని పేట్ మహెలా కాలనీకి చెందిన అవేజ్ ఉర్ రహెమాన్ ఒకేసారి రెండు ఉద్యోగాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో అద్భుతమైన ఫలితాలు సాధించాడు. గతంలో తెలంగాణ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల్లో పరీక్షలు రాసి జూనియర్ లెక్చరర్ ఉర్దూ మీడియంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఫిబ్రవరి 29న జూనియర్ లెక్చరర్ ఉర్దూ ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం విడుదల చేసిన టీజీటీ ఉర్దూ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో ఉద్యోగం సాధించాడు.

వార్షిక లక్ష్యం సాధించిన ఆర్కే 6 గని

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 6 గని వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని ముందే సాధించింది. గని ఉత్పత్తి లక్ష్యం 1,80,000 టన్నులుగా ఉంది. మార్చి 31 నాటికి ఈ మొత్తాన్ని సాధించాలి. గురువారం నాటికి ఈ ఉత్పత్తిని సాధించింది. కంపెనీలో భూగర్భ గనులన్నింటికంటే 30 రోజుల ముందే ఉత్పత్తి సాధించిన గనిగా ఆర్కే 6 రికార్డు సృష్టించింది. ఏరియా పరంగా చూస్తే ఓసీపీలు, భూగర్భ గనుల్లో ఇది ముందుంజలో ఉంది. ఇదిలా ఉంటే గత ఆర్థిక సంవత్సరం 2022–23లో ఈ గని 56 రోజులు ముందే నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి రికార్డు నెలకొల్పింది. కంపెనీలో బొగ్గు ఉత్పత్తిని సాధించే భూగర్భ గనుల్లో ఆర్కే 6 గనికి ప్రత్యేక స్థానం ఉంది. గత సంవత్సరం ఎస్‌డీఎల్ సెక్షన్ ద్వారా అధిక ఉత్పత్తిని సాధించిన గనిగా రికార్డు నెలకొల్పింది. బొగ్గు ఉత్పత్తి, రక్షణలో గని తనకు తానే సాటి అనిపించుకుంటోంది. వార్షిక ఉత్పత్తిని ముందే సాధించడంపై జీఎం సంజీవరెడ్డి, ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, గని ఫిట్ సెక్రెటరీ సంఘం సదానందం హర్షం వ్యక్తం చేశారు.

సమష్టి కృషితోనే ..

సమష్టి కృషితోనే ఈ ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాం. దీనికి ఉద్యోగులు, అధికారులందరికీ అభినందనలు. ఏరియా జీఎం, ఏజెంట్ మార్గదర్శకంలో గని అనుకున్న లక్ష్యాలు సాధిస్తోంది. వచ్చే సంవత్సరం కూడా ఇదే ఒరవడిని సృష్టిస్తాం. – ఈ.తిరుపతి, గని మేనేజర్

రైలు కిందపడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: కడుపునొప్పి భరించలేక సింగరేణి రిటైర్డ్ కార్మికుడు జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల శివారు ప్రాంతంలో శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ కథనం ప్రకారం.. కాసిపేట మండలం సోమగూడెం ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన జాపతి చంద్రయ్య(72) రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. భార్య గతంలోనే మృతిచెందింది. కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రెండు నెలల క్రితం శ్రీశ్రీనగర్‌లో కూతురి వద్ద ఉంటున్నాడు. పెన్షన్ కోసం శుక్రవారం సోమగూడెం వెళ్తున్నానని చెప్పి వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోక్ పైలట్ సమాచారంతో జీఆర్పీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి పర్సు పరిశీలించి బంధువులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అత్తమామలపై కాల్పులు జరిపిన అల్లుడి అరెస్టు

- పరారీలో మరో నిందితుడు
- అదనపు కట్నం కోసమే పన్నాగం
- బీహార్‌లో తుపాకి కొనుగోలు



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లాలో సంచలనం సృష్టించిన తుపాకి కాల్పుల ఘటన కేసును పోలీసులు ఛేదించారు. కన్నెపల్లి మండలం సాలిగామ గ్రామంలో అత్తారింటికి వెళ్లి అత్తమామల హత్యకు యత్నించి కాల్పులు జరిపిన అల్లుడిని అరెస్టు చేశారు. అదనపు కట్నం కోసం అత్తమామలను చంపడానికి తుపాకి కొనుగోలు చేశాడని పోలీసులు తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఏ.రవికుమార్ వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామానికి చెందిన గోమాస నరేందర్‌కు కన్నెపల్లి మండలం సాలిగామకు చెందిన గోలేటి బేబీతో 2016 వివాహం జరిగింది. అప్పటి నుంచే ఆస్తి, అదనపు కట్నం కోసం భార్య, అత్తమామలు గోలేటి లక్ష్మి, శంకర్‌లను వేధిస్తున్నాడు. కొన్నేళ్లుగా కరీంనగర్‌లోని నగునూర్‌లో భార్యాపిల్లలతో ఉంటున్నాడు. నరేందర్ పేపర్‌ప్లేట్ పరిశ్రమలో పని చేస్తుండగా, బేబీ కూతురు జన్మించిన తర్వాత నర్సు ఉద్యోగం మానేసింది. జల్సాలకు అలవాటుపడిన నరేందర్ పెళ్లిలో ఒప్పుకున్న రూ.10లక్షల కట్నం తేవాలని, లేదంటే చంపుతానని బెదిరిస్తున్నాడు. ఏడాది క్రితం అత్తమామలపై హత్యాయత్నం చేశాడు. అనుమానం వచ్చిన గ్రామస్తులు నరేందర్‌ను చితకబాదారు. దీంతో కక్ష పెంచుకున్న నరేందర్ అత్తమామలను అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. గతనెల 27న నరేందర్ బెల్లంపల్లి మండలం రంగపేట గ్రామానికి చెందిన కోడి మహేష్‌తో అత్తారింటికి వెళ్లాడు. పథకం ప్రకారం తన వద్ద ఉన్న తుపాకితో అత్తమామలను చంపడానికి బెదిరించి రెండు రౌండ్ల కాల్పులు జరిపాడని ఏసీపీ తెలిపారు. శంకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టామని, ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో నరేందర్‌ను కరీంనగర్‌లో పట్టుకున్నామని వివరించారు.

బీహార్‌లో తుపాకి కొనుగోలు

నరేందర్ కరీంనగర్‌లో తనతోపాటు కలిసి పని చేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన రవీందర్ పెళ్లికి గత ఫిబ్రవరి 26న వెళ్లాడు. అక్కడ తుపాకి, రౌండ్లు కొనుగోలు చేశాడు. కరీంనగర్ నుంచి సాలిగామకు వెళ్లి ఆ పిస్తోలుతో కాల్పులు జరిపినట్లు నిందితుడు అంగీకరించాడని ఏసీపీ వివరించారు. నిందితుడి నుంచి పిస్తోలు,8 రౌండ్లు, బైక్,సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. సమావేశంలో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, భీమిని,తాళ్లగురిజాల, మాదారం ఎస్సైలుప్రశాంత్, నరేశ్, అశోక్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో


ఘటనాస్థలంలో ఆటో, బైక్

బెల్లంపల్లిరూరల్: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయపడినట్లు తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బెల్లంపల్లికి చెందిన చంద్రశేఖర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం బైక్‌పై కళాశాలకు వెళ్తున్నాడు. నెన్నెల నుంచి ఆటో బెల్లంపల్లికి వస్తోంది. ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని మూలమలుపు వద్ద ఆటోడ్రైవర్ వేగంగా ఆటోను నడిపి ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో చంద్రశేఖర్‌కు,ఆటోలో ఉన్న ఐదుగురి ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి మంచిర్యాలకు పంపించారు. చంద్రశేఖర్ అన్న గంగారాం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ అడ్మిషన్స్: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG /B.Tech/M.Tech/MBA/MCA/MS/MBBS/D/B/M ఫార్మసీ, FAST TRACK (ఫెయిల్ స్టూడెంట్) WT'S app: PH: 7993080835. [HA-1267]

SERVICES

BUSINESS OFFER

■ రెస్టారెంట్ బిజినెస్ పెట్టాలని ఉందా? ఫ్రాంచైజ్ కొరకు మా వద్ద 4 బ్రాండ్లు ఉన్నాయి. వివరాలకై సంప్రదించండి: 8328433913. [HA-2385]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233864]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899 [H-793696]

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.